క్లుప్తంగా

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మొమిన్ మునీర్‌బాషా, ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్, ఇబ్రహీం, ఖలీలుల్లా, షరీఫ్, టైగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



పొదుపు మహిళలతో చేతులు శుభ్రం చేయిస్తున్న వైకేపీ సిబ్బంది

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవడం అలవర్చుకోవాలని ఏపీఎం అంబమ్మ, వైకేపీ సీసీ గాంధీ తెలిపారు. ఆదివారం గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డేను పురస్కరించుకొని మండలంలోని జూపాడుబంగ్లా, తూడిచెర్ల, మండ్లెం, తంగడంచ, తర్తూరు, 80బన్నూరు, తరిగోపుల తదితర గ్రామాల్లో వైఎస్సార్ కాంతి పథం సిబ్బంది పొదుపు మహిళలకు, గ్రామస్తులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం మూడు పర్యాయాలు చేతులు తప్పనిసరిగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఏదో మొక్కుబడిగా చేతులను శుభ్రం చేసుకుంటే సరిపోదన్నారు.

పగిద్యాల: గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను పురస్కరించుకుని మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిద్యాల, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాలలో ఆదివారం పొదుపు మహిళలు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ క్రాంతి పథం సీసీ ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో పొదుపు మహిళలు నెహ్రూనగర్‌లో ప్లకార్డ్స్ ప్రదర్శించి ర్యాలీ చేపట్టారు.

మహానంది: వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బండిఆత్మకూరు మండలం పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్ అన్నారు. పార్నపల్లె గ్రామంలో ఆదివారం గ్లోబల్ వాషింగ్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామలింగేశ్వర రెడ్డి, ఈఓఆర్‌డీ శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



జస్సికా



అశ్వఖ్

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన ఆటల పోటీల్లో సున్నిపెంటలోని డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఏపీజెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో అండర్- 14 విభాగంలో 7వ తరగతి విద్యార్థిని జెస్సికా మిలిందా, 10వ తరగతి చదువుతున్న ఎస్‌కే ఆశ్వఖ్ స్కేటింగ్‌లో తమ నైపుణ్యాన్ని కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ టి.కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. స్కేటింగ్ లో శిక్షణకు పీఈటీ వెంకటరావమ్మ, ఏపీజెన్‌కో చీఫ్ ఇంజినీర్ డీవీ ఎస్ఎస్ఎల్ కాంతారావు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యానకేంద్రం నిర్వాహకులు

జూపాడుబంగ్లా: ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం మెరుగుపడుతుందని పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు శివరాజ్, ప్రశాంత్, శరత్ తెలిపారు. ఆదివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో ర్యాలీ నిర్వహించి శ్రీవీరభద్రస్వామి ఆలయం వద్ద గ్రామస్తులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సుఖాసనం వేసుకొని కళ్లుమూసుకొని ఏకాగ్రతతో శ్వాసపై ధ్యాస ఉంచటమే ధ్యానం చేయటమన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయటం అలవర్చుకోవాలన్నారు.

దుర్గతులను దూరం చేసే నవదుర్గలు

- దసరా ఉత్సవాలలో శ్రీశైల భ్రమరాంబకు నవదుర్గాలంకరణ
- నవదుర్గల విశిష్టతను వివరించిన మార్కండేయపురాణం
- అమ్మవారి దర్శనంతో పునీతులవుతున్న భక్తజనులు

శ్రీశైలంటెంపుల్: దుర్గాదేవి తనను స్మరించిన ప్రాణులందరి భయాన్నీ హరిస్తుంది. శుభకరమైన బుద్ధిని ఇస్తుంది. పేదరికాన్ని పోగొడుతుంది. శరనవ రాత్రుల్లో నవదుర్గా రూపాలలో అర్చింపబడుతూ ఉంటుంది. నవదుర్గల విశిష్టతను మార్కండేయపురాణం వివరిస్తుంది. 'దుర్గం' అంటే దాటడానికి కష్టమైనది అని అర్థం. సంక్లిష్టతలను, కష్టాలను నివారించేది కనుక 'దుర్గా' నామం ఉద్భవించింది. దుర్గముడనే రాక్షసుడు వేదాలను ఎత్తుకుపోయాడు. దాంతో యజ్ఞయాగాదులకు ఆటంకం ఏర్పడింది. ప్రకృతి గతి తప్పింది. అప్పుడు దుర్గాదేవి శాకాంబరి వంటి వివిధ రూపాలలో అవతరించి రాక్షసుడిని సంహరించింది. ప్రతిమాసంలోనూ శుక్లపక్షంలో వచ్చే ఎనిమిదో తిథిని దుర్గాష్టమిగానే శాక్తేయులు నిర్వహించుకుంటారు. శక్తి ఆరాధనకు ప్రధానమైన వసంత, అశ్వయుజ, మాఘ, ఆషాడ నవరాత్రి దినాల్లో దుర్గావతారాలను వివిధ పేర్లతో పూజిస్తారు. అశ్వయుజమాసంలో వచ్చే శరన్నవరాత్రులలో నవదుర్గాలంకారాలు ప్రధానమైనవి. శ్రీశైలంలో దసరా మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పునీతులవుతున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నవదుర్గా స్వరూపాల గురించి ప్రత్యేక కథనం..



శ్రీశైల ఆలయం

శైలపుత్రి..



పర్వతరాజు హిమంతుని కుమార్తె కనుక తొలిదుర్గను శైలపుత్రిగా అర్చిస్తారు. అమెను సేవించినవారు అన్ని రకాల వ్యాధుల నుంచి విముక్తి కలిగి, ఆరోగ్యం పొందుతారని విశ్వాసం.

బ్రహ్మచారిణి..



నారద మహాముని బోధనలతో ప్రభావితురాలైన పార్వతి అన్నాహారాలు మాని శివుని కోసం తపస్సు చేసింది. అమె అకుంఠిత దీక్ష, సాధనలకు పరమశివుడు పరమానందించి, అమెను తనలో సగం చేసుకుని అర్ధనారీశ్వరుడయ్యాడు. బ్రహ్మచారిణీ మాత తన భక్తులకు శక్తి, ధైర్యం, అంకితభావం, ఏకాగ్రత లక్షణాలను వరంగా ప్రసాదిస్తుంది.

చంద్రఘంట..



అర్ధచంద్రుడిని శిరస్సున ధరించి ఉంటుంది. దశబాహువులతో స్వర్ణకాంతులీనుతుంది. ఐదు చేతుల్లో బాణం, ధనుస్సు, త్రిశూలం, ఖడ్గం, గద ధరించి రౌద్రరసాన్ని కురిపిస్తుంది. మరో మూడు హస్తాల్లో కమలం, కమండలం, జపమాల ధరించి ప్రసన్నంగా ఉంటుంది. వరద, అభయ ముద్రలతో భక్తులను ఆశీర్వదిస్తుంది. సింహవాహినిగా నిరంతరం చెడును ప్రతిఘటిస్తూ ఉంటుంది. భయంకరమైన స్వరంతో రాక్షసులను భయపెడుతుంది. అమె కరుణా కటాక్షాలతో భక్తుల బాధలు, దుఃఖాలు పోగొడుతుంది.

కూష్మాండ ..



కూష్మాండ దేవి వదనం స్వచ్ఛ కాంతులీనుతూ బంగారు వర్ణంతో అలరారుతుంది. ఈ తల్లికి ఎనిమిది చేతులు ఉండడంతో అష్టభుజిగా పూజలు అందుకుంటుంది. నాలుగు చేతులలో బాణం, ధనుస్సు, చక్రం, గద ఉంటాయి. మూడు చేతుల్లో తామరపువ్వు, జపమాల, కమండలం ఉంటాయి. ఎనిమిదో చేయి అమృత భాండాన్ని ధరించి ఉంటుంది. ఈ అమ్మతమే మానవులకు ఆరోగ్యాన్ని, ఆయుర్దాయాన్ని ఇస్తుందని భక్తుల విశ్వాసం.

స్కందమాత..




పుత్రడైనా కుమారస్వామిని ఎల్లప్పూడూ తన ఒడిలో ఉంచుకుని దర్శనమిస్తుంది స్కందమాత. ఈమె చతుర్భుజి. స్కందుని ఒడిలో కూర్చొబెట్టుకొని, మరో చేత కలువ పువ్వు ధరించి ఉంటుంది. మిగిలిన రెండూ అభయ వరద ముద్రలు. స్కందమాతను ఉపాసించిన భక్తుల కోరికలన్నీ నెరవేరుతాయి. దివ్య తేజస్సు లభిస్తుంది. సంతానం వృద్ధి చెందుతుంది.

కాత్యాయని..




కాత్యాయనుడు కఠోర తపస్సు చేసి జగన్మాతను కుమార్తెగా పొందాడు. ఎడమ వైపు రెండు చేతుల్లో ఖడ్గం, తామరపువ్వు, కుడి వైపే అభయ, వరద ముద్రలతో చతుర్భుజిగా, సింహవాహినిగా కత్యాయని సాక్షాత్కరిస్తుంది. ఈ దేవిని భక్తితో సేవించినవారికి చతుర్విధ పురుషార్థాలు లభిస్తాయి. రోగాలు, శోకాలు, సంతాపాలు, భయాలు దూరమవుతాయి. జన్మజన్మాంతర పాపాలు నశిస్తాయి.

మహాగౌరి..




ఈమెను ఎనిమిదేళ్ల కన్యగా పూజించే ఆచారం ఉంది. పరమేశ్వరుణ్ణి పతిగా కోరి కఠోర తపస్సు చేసిన సమయంలో గౌరీదేవి పచ్చని పసిమి శరీరం నీలిమేఠ వర్ణంలోకి మారిపోయింది. శివుడామెను తన జటాజూటిలోని గంగతో తడిపి చల్లదనాన్ని కలిగించాడు. తిరిగి అమె మధ్యస్తమైన గౌరవర్ణంలోకి మారింది. మహాగౌరిగా సాక్షాత్కరించింది.

సిద్ధిధాత్రి..



మహర్నవమి నాడు సిద్ధిధాత్రిని శ్రీరాజరాజేశ్వరిగా అలంకరించి కొలుస్తారు. అణిమాది అష్టసిద్ధులు ప్రసాదించే తల్లి ఈమె. తామరపువ్వు మీద ఆసీనురాలై ఉంటుంది. నాలుగు చేతుల్లోనూ చక్రం, గద, శంఖం, తామరపువ్వులు ధరించి ఉంటుంది. ఈమె కృపచేత సాధకుల లౌకిక, పరమార్థిక మనోరథాలు నెరవేరుతాయి.

కాళరాత్రి..



భూత, ప్రేత, పిశాచ గణాలు ఈ తల్లి పేరు వినపడితే పరుగు లంఘిస్తాయి. నిరంతరం శుభాలు కలిగించే తల్లి గనుక ఈమెను శుభంకరిగా ఆరాధిస్తారు. చిక్కటి నలుపు వర్ణపు మేని చ్ఛాయతో, నల్లటి కేశాలను విరబోసుకుని దర్శనమిస్తుంది. మూడు కన్నులు ఉంటాయి. ఈ తల్లి గార్దభవాహినిగా దర్శనమిస్తుంది. ఇనుపముల్లు, ఖడ్గం ఆయుధాలుగా ధరించి ఉంటుంది. ఈమెను ఉపాసించే వారికి భయాలన్నీ తీరిపోతాయి.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు శిక్షణ

ఆత్మకూరు: ఓపెన్ స్కూల్ విద్యార్థులకు స్కిల్‌హబ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్లను ఆదివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 10 నుంచి ఓపెన్‌స్కూల్ విద్యార్థులకు స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం వివిధ సెంటర్లలో నిర్వహిస్తున్న సీపీపీ క్లాసులు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా ఉపాధి రంగంలో రాణించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం , ఆత్మకూరు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కిల్‌హబ్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ

ఊరెళ్తే పోలీసు స్టేషన్‌లో సమాచారమివ్వాలి



ఎస్ఐ అశోక్

పాములపాడు: దసరా సెలవులకు ఊర్లెళ్లే ముందు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, ముందు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ అశోక్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విలువైన బంగారు, వెండి నగలు వీలైనంత వరకు ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని చెప్పారు. సమాచారమిస్తే దొంగ తనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని వివరించారు. ద్విచక్ర వాహనాలకు చక్రాలకు కూడా తాళాలు వేస్తే మంచిదన్నారు. అత్యవసర సమయాల్లో 100 లేదా 112కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని వివరించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

పాములపాడు: గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సర్పంచు వరప్రసాద్ అన్నారు. మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణారావు పేట గ్రామంలో ఇటీవల రూ.5లక్షల అంచనాతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డును పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రకారంగా పార్టీలు, కులాలు, మతాలకతీతంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

జంబులాపరమేశ్వరికి మాజీ ఎమ్మెల్యే పూజలు

వెలుగోడు: అబ్దుల్లాపురం గ్రామ సమీపంలోని జంబులాపరమేశ్వరి ఆలయంలో నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన స్వగ్రామమైన అబ్దుల్లాపురంలోని జంబులా పరమేశ్వరికి మొక్కలు తీర్చుకొని, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ రాజేష్, చక్రధర్, అశోక్, గడివేముల సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, లబ్బి లక్ష్మన్న, లబ్బి నాగస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని బాపనంతపురం గ్రామంలో ఉదయం రైతు భరోసా కేంద్రాన్ని, నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 11 గంటలకు గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి మున్సిపల్‌వార్డు కౌన్సిలర్లు , ప్రజా ప్రతినిధులు , వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

దేవుడు ఒక్కడే

పాములపాడు: సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు, మునిదాసు అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మలూరు, కృష్ణారావు పేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భగవద్గీతలోని పురుషోత్తం ప్రాప్తి యోగధ్యాయంలో 16, 17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారమని చెప్పారు.

రేపు నెహ్రూనగర్‌లో 'గడప గడపకు'

పగిద్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ సచివాలయం-2 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

శ్రీశైలం శివాజీ గోపురంపై నాగుపాము

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఉత్తరగోపురమైన శివాజీగోపురంపై శనివారం నాగుపాము ప్రత్యక్షమైంది. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలోని అన్ని గోపురాలకు విద్యుద్దీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా శివాజీగోపురానికి విద్యుద్దీకరణ చేసేందుకు కూలీలు గోపురంపైకి ఎక్కగా పాము కనిపించింది. దీంతో వారు దేవస్థాన అధికారులకు సమాచారాన్ని అందించారు. దేవస్థాన అధికారులు అటవీశాఖ స్నేక్ క్యాచర్ కాళీచరణ్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో స్నేక్‌క్యాచర్ అక్కడికి చేరుకుని పాముని పట్టుకున్నాడు. అనంతరం అటవీప్రాంతంలో సురక్షితంగా వదిలేశారు. దసరా మహోత్సవాల ప్రారంభం రోజు శివాజీగోపురంపై నాగుపాము కనిపించడం విశేషమని భక్తులు భావిస్తున్నారు.



శివజీగోపురంపై నాగుపామును పట్టుకుంటున్న స్నేక్‌క్యాచర్

నాణ్యత లేకుండా నిర్మించడంతోనే కట్ట కుంగింది




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

నందికొట్కూరు: టీడీపీ పాలనలో అలగనూర్ రిజర్వాయర్‌ను నాణ్యత లేకుండా నిర్మించడంతోనే బండ్ కుంగిపోయిందని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రిజర్వాయర్‌ను నిర్మిస్తే.. జగనన్న కూల్చారని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు రిజర్వాయర్ నిర్మాణానికి పునాది వేస్తే, చంద్రబాబు పాలనలో సోమ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చి పని చేయించారని గుర్తు చేశారు. కట్ట నిర్మాణానికి నాణ్యమైన మట్టి వాడకుండా ఇష్టానుసారంగా అక్కడే ఉన్న మట్టి వాడడంతో కూలిపోతే జగనన్న ప్రభుత్వానికి అంటగట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు కింద రిజర్వాయర్ బండ్ కుంగినచోట రూ. 5 కోట్లతో పనులు చేసినట్లు చూపి, దోచుకుని ఇసుక సంచులు వేశారని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో జరిగిన తప్పిదాలను జగనన్న పాలనలో జరిగినట్లు తప్పుడు కథనాలు రాయడం సిగుచేట్టన్నారు. కట్ట కుంగిన చోట భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా బలంగా నిర్మాణం చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, కోకిల రమణారెడ్డి, శివనాగిరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.















ఓంకారంలో రాజరాజేశ్వరీగా ఉమాదేవి, బాలత్రిపురసుందరిదేవిగా కొలనుభారతిదేవి, కొణిదేల, నందికొట్కూరులో బాలాత్రిపురసుందరిగా, కొత్తముచ్చుమర్రిలో త్రైలోక్య మోహన గౌరీ, ఆత్మకూరులో రాజరాజేశ్వరిదేవిగా, జూపాడుబంగ్లాలో శైలపుత్రిగా సరస్వతీ దేవి

జగన్మాతా.. నమోస్తుతే

- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- మహానందిలో నవదుర్గా కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన
- వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాలు మహానందిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికుల బృందం ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, గోప్రదక్షిణ, ద్వారపూజలు చేశారు. పుణ్యాహవాచనం, కంకణధారణ, నవదుర్గా కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన పూజలు చేపట్టారు. తొలిరోజు వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు అమ్మవారి ఉత్సవం ముందు ప్రదర్శించారు.

ఓంకారంలో రాజరాజేశ్వరీగా ఉమాదేవి

బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీ గంగా ఉమాసమేత ఓంకారసిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహాకాళి, మహాలక్ష్మి, సరస్వతీ, కలశ ఆవాహన, ఏకవార రుద్రాభిషేకం పూజలు చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు ఘనంగా జరిపారు.

గ్రామాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు

మహానంది పుణ్యక్షేత్రంతో పాటు గ్రామాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభ అయ్యాయి. బొల్లవరం గ్రామంలోని శ్రీ మల్లమ్మ సమేత గంగాదేవి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. బుక్కాపురం, తిమ్మాపురం, గాజులపల్లె, గోపవరం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

బాలాత్రిపురసుందరిగా కొలనుభారతిదేవి

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంతో దర్శనమిచ్చారు. ప్రాతఃకాలం నుంచే అమ్మవారికి పంచామృత సహిత పంచసూక్తములతో అభిషేకాధి కార్యక్రమాలు, విశేష అలంకరణ, పుష్పార్చన, కుంకుమార్చన, మహానైవేద్యం తదితర కార్యక్రమాలు చేపట్టారు. సంగమేశ్వరం క్షేత్రంలో లలితాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు తెలకపల్లి రఘురామశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా సప్త నది సంగమ తీరంలో ఎగువ పుష్కర ఘాట్‌లోని ఉమామహేశ్వరాలయంలో విశేషపూజలు చేశారు.

108 కలశాలతో వాసవీమాతకు అభిషేకం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశాలతో కృష్ణాజలాలను శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. వాసవీమాతకు అభిషేకం చేశారు.



మహానందిలో హోమపూజలు నిర్వహిస్తున్న ఈఓ, చైర్మన్, పండితులు

శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణ

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో, శ్రీచౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారు శరన్నవరాత్రుల సందర్భంగా తొలిరోజు అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకటాపురం గ్రామంలో వెలిసిన శ్రీరాజరాజేశ్వరి దేవిని శ్రీబాలత్రిపుర సుందరిగా అలంకరించారు.

మొదటి రోజు అమ్మవారి అలంకరణ

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వేల్పనూరు అంకాల పరమేశ్వరి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వాసవీ మాతను బాలత్రిపురసుందరి అలంకరణలో అలంకరించారు. వేల్పనూరు గ్రామంలోని పురోహితులు విశ్వనాథం ప్రత్యేక పూజలతో అంకాలమ్మను శైలపుత్రికా దుర్గా రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో

నందికొట్కూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులందరికీ శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ, భక్తులందరూ అమ్మవారికి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర అవార్డు గ్రహీత సాయి లిక్షితశ్రీ, శిష్య బృందం సాంస్కృతిక, తదితర కార్యక్రమాలు చేపట్టారు.

బాలాత్రిపురసుందరిగా భ్రమరాంబాదేవి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని కొణిదేల శ్రీభ్రమరాంభమల్లికార్జున స్వామి వార్ల దేవాలయంలో దేవీ శరన్నవరాత్రులను ఆలయ అర్చకులు ఘనంగా ప్రారంభించారు. దేవాలయంలోని భ్రమరాంబాదేవీ అమ్మవారు ఆదివారం బాలాత్రిపుర సుందరీ దేవీ అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శైలపుత్రి రూపంలో సరస్వతీమాత

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని శ్రీసరస్వతీదేవి ఆలయంలో దసరా ఉత్సవాలను అర్చకులు లక్ష్మీనృసింహశర్మ కుంకుమార్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకాలతో ప్రారంభించారు. అమ్మవారిని శైలపుత్రిగా తీర్చిదిద్దారు. తాటిపాడు, జూపాడుబంగ్లా గ్రామాల్లో వెలసిన అమ్మవారు బాలత్రిపురసుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు.

త్రైలోక్య మోహన గౌరీ అలంకరణ

పగిద్యాల: దేవీ నవరాత్రుల్లో భాగంగా కొత్త ముచ్చుమర్రి లలితా సంగమేశ్వర దేవాలయంలోని పార్వతీదేవి అమ్మవారు మొదటి రోజు త్రైలోక్య మోహన గౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంగమేశ్వర దేవాలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చౌడేశ్వరీ మాతకు పూజలు

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ మాతా ఆలయంలో ఆదివారం బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల సందర్భంగా మొదటి రోజు జరిగిన పూజలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మిడుతూరులో..

మిడుతూరు: దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకొని స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం, చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవార్లు బాలాత్రిపుర సుందరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకపరమేశ్వరీ ఆలయంలో అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, లలితసహస్ర నామం తదితర విశేషపూజలను వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.